# కళాకారుడు

'హల్లో ! ఎక్కడికెళ్తున్నావ్ బావా?' అంటూ బాణంలా దూసుకొచ్చిన వేణుగోపాల్ నగరేశం ముందు దీపస్తంభంలా నుంచున్నాడు.

సిటీ బస్సందుకోవాలని యమ స్పీడందుకున్న నగరేశం కాళ్ళకు సడన్‌బ్రేక్ పడింది. చూపులు నిలబడి పోయినై. అస్తిపంజరానికి తోలు అతికించినట్టున్న కాళ్ళూ చేతులు, పొట్టి దొండకాయ ముక్కు, గుమ్మడికాయ బొజ్జ, ఎక్కుపెట్టిన బాణాల్లా ఆకాశం వైపు చూస్తున్న తల వెంట్రుకలు, సర్కస్ బఫూన్ డ్రెస్సూ... వెర్రి చూపుల వేణుగోపాల్ ఫేస్‌కట్ చూస్తుంటే డోకొస్తుంది - నగరేశంకు.

విలువైన సమయం వృధా చేస్తున్న వీడెవడోగాని చెప్పందుకుని చెంపలు వాయించాలన్పించింది. కానీ చెప్పు తెగిపోతే... ఆఫీసుకు మరింత ఆలస్యమైపోతుంది.

'ఏట్లోకెళ్తున్నా... జరుగూ!' గుర్రుమన్నాడు.

'అబ్బో ! బావగారి పరిహాసం గూడా బాగానే ఉందే' నవ్వేశాడు.

కదిలే కాలం, కడలి కెరటం మనిషి కోసం ఆగవని నగరేశానికెప్పుడో తెలుసు. టైం పరుగెడుతోంది. అతనిలో బీ.పీ. పెరిగిపోతోంది.

'నువ్వెవరో గానీ... తప్పుకోవయ్యా మగడా : బస్సెళ్ళిపోతే నా బతుకు....'

'హామ్మో ! నన్ను గుర్తుపట్టలేదా బావా!' గుండెలు గుద్దుకున్నాడు. వెంటనే సర్దుకొని 'సరేగాని... ఏ బస్సెక్కాలి ? ఎక్కడికెళ్ళాలో చెప్పు బావా ! నేనూ నీతోనే వస్తా :' మళ్ళీ నవ్వాడు. పదహారు రకాల పళ్ళ ప్రదర్శనైంది.

ఆనవాయితీ ప్రకారం సిటీ బస్సొచ్చి స్టేజికి ఫర్లాంగు దూరంలో ఆగింది. వేడి తగిలిన థర్మామీటర్లోని పాదరసంలా - నగరేశం టెన్షన్ పెరిగిపోతోంది. జుట్టు పీక్కుంటూ -

'అయ్యో ! నా బస్సయ్యా బాబూ !' కుడిపక్క నుండి తప్పుకోబోయాడు. సూటుకేసు అడ్డమొచ్చింది. 'ముందు నువ్వు తప్పుకో !' ఎడమపక్క నుండి ప్రయత్నించాడు. ఆటోరిక్షా ఎదురొచ్చింది. చంకలున్న ఫైలు జారి కిందబడింది. రెండు చేతుల్తో బరబరా జుట్టు పీక్కున్నాడు.

'మరి నన్ను గుర్తుబట్టానని ఒప్పుకో !'

'ముందు తప్పుకో'

'ముందు ఒప్పుకో'

'గుర్తా... గాడిదగుడ్డా... తప్పుకోమన్నాగా :' ఏడుపొస్తుంది. రోషంతో కింది పెదవి మునిపళ్ళ మధ్యకొచ్చింది.

సిటీ బస్సు స్టైల్‌గా వెళ్ళిపోయింది.

'నిన్ను చూస్తే జాలేస్తుంది బావా !' ముక్కుమీద వేలు.

సావర్కర్ చౌరస్తా అది. చుట్టూరా దుకాణాలు. వచ్చీపోయే జనాల జోరు, వాహనాల హోరు. ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ లేదు. 'నువ్వెవడివిరా రాస్కెల్' కోపంతో కనుగుడ్లు ముందుకొచ్చినై. నమలక మింగెయ్యాలనిపిస్తుంది కాని తన శాంతమె తనకు రక్ష అని గుర్తుకొచ్చింది. 'నా బస్సు మిస్సైంది. మరో బస్సన్నా పట్టుకుంటా, దయచేసి తప్పుకో తండ్రీ !' గెడ్డం పట్టుకు బతిమాలాడు.

'అయ్యో.... నేను బావా ! వరంగల్ వేణుగోపాల్‌ని. నీ బామ్మర్దిని బావా !' సూటుకేసందివ్వబోయాడు.

సూటుకేసును ఫుట్‌బాల్‌లా తన్నాడు. కాలునొప్పి పుట్టింది గాని అది అంగుళం కూడా కదల్లేదు.

అయ్యయ్యో ! ముందే మా ఆఫీసర్‌గాడు డిసిప్లీన్ రోగిష్టి. ఐదు నిమిషాలు ఆలస్యంగా వెళ్తే ఆరు పేజీల మెమో ఇచ్చి అరగంటలో జవాబివ్వమంటాడు. ఆ తర్వాత ఇంక్రిమెంటు కట్టు, ప్రమోషన్ ఫట్టు - కసిగా జుట్టు పీక్కున్నాడు.

'వేణుగోపాలా !' సంయమనంతో నగరేశం నోరు నంగునూరు చెరువు తూములా తెరుచుకుంది. చూపుల్లో బేలతనం. ఆరేడు సెకండ్లలో ఇరవై ముప్పై దోమలు నోట్లో దూరినై.

దీన్ని మస్కిటో టౌనంటే బాగుండేది - అందామనుకుంటే దోమల దండు గొంతు కడ్డ పడింది. ఉక్కిరిబిక్కిరై కళ్ళల్లో నీళ్ళు కమ్ముకున్నై.

'అయ్యయ్యో : రాకరాక నేనొస్తే ఏడుస్తావెందుకు బావా ? మా అలివేలక్క బావుందా ?'

మరో సిటీ బస్సొచ్చి మారాజులా వెళ్ళిపోయింది.

'టైమైపోయిందయ్యో !' షర్టుతో కళ్ళద్దుకున్నాడు.

'అయ్యో అలివేలక్కా ! ఈ పాడు లోకంలో నీ టైమైపోయిందా ! అప్పుడే నీకు నూరేళ్ళు నిండాయా ? ఎంత పుణ్యాత్మురాలివే అలివేలక్కా ! పసుపు కుంకుమలతో వెళ్ళిపోయావా ? అక్కా! ఇప్పుడీ మెగా టౌన్లో నేనెవరింటికెళ్ళాలే అక్కా !' రాగమందుకుని నగరేశం గుండెల మీద వాలిపోయాడు. అతని మొహమ్మీది దుమ్మంతా తన షర్టుకు అచ్చొత్తుతూంటే నగరేశానికి చిర్రెత్తింది.

'పోరా నా కొడకా...' అంటూ నెట్టేశాడు కోపంతో.

మొదలు నరికిన చెట్టులా చౌరస్తా మధ్యలో పడిపోయాడు వేణుగోపాల్. చుట్టూ మూగిన జనాలు తననో రాక్షసుడిలా చూస్తున్నారు. ఏదేదో అడుగుతున్నారు.

'అరెరే.... చౌరస్తాలో చావుష్‌ల ఫైటింగులా ?' హెడ్ కానిస్టేబుల్ కనకయ్య గునగునా పరుగెత్తుకొచ్చాడు. ట్రాఫిక్ జామైపోయింది. వాహనాలు హారన్లతో అరుస్తున్నై.

'ఈయన మా బావగారండీ !' కనకయ్య సాయంతో లేచి బట్టలు దులుపుకున్నాడు వేణుగోపాల్. 'పోయిన సమ్మర్లో మా అలివేలక్కను పెళ్ళాడాడండీ !' దీనంగా చెబుతున్నాడు. అక్షింతలు

పడేదాకా ఆవిడ్ని గాఢంగా ప్రేమించానన్నాడు. ఆ తర్వాత కట్నం తెమ్మని కాల్చుకు తిన్నాడు చివరికి ఆ అమాయకురాలి నమాంతం చంపేశాడండీ !' గొల్లుమన్నాడు.

అయ్యో పాపమంటూ మగజనాలు నోరు తెరిచారు. ఆడజనాలు శాపనార్థాలందుకున్నారు.

'గోవిందా... గోవిందా !' చేతి గడియారం చూసుకుని చేతులెత్తేశాడు నగరేశం.

'ఐతే... ఇది డౌరీ డెత్ కేసన్నమాటా ?' హెడ్ కానిస్టేబుల్ కనకయ్య హెడ్డులో ఓ మెరుపు మెరిసింది. కోతికి బెల్లం దొరికినట్టైంది. 'నడూ స్టేషన్‌కు' నగరేశం జబ్బ మీద చెయ్యేశాడు. 'చలో గానలోలా ! నువ్వు కూడా రా !' లాఠీ గాల్లో ఆడిస్తూ వేణుగోపాల్‌తో అన్నాడు.

'నాపేరు గానలోల కాదండీ !'

'గానలోల కాకపోతే గార్దభలోల. పదా...' నల్లులు పారుతున్నట్టున్న హెడ్డు మీసాల కింద తెల్లని నవ్వు.

'అది కాదండీ... నేనాఫీసు...' తన విషమ పరిస్థితి వివరించబోయాడు నగరేశం.

'నథింగ్ డూయింగ్! ఏదన్నా చెప్పాలనుకుంటే మా స్టేషన్లోనే... ఛలో !' కుడిచెయ్యిలో లాఠీ ఆడుతూంటే ఎడమచెయ్యి మీసాలను మెలేస్తుంది.

'అయ్యో ! హమ్మయ్యా !' చొక్కా చించుకున్నాడు నగరేశం. జుట్టు పీక్కుంటూ కనకయ్యను వెంబడించాడు.

◎ ◎ ◎ ◎ ◎

'ఐతే నా కంప్లైంటును కాతరు చెయ్యరా ?' పోలీస్‌స్టేషన్లో బల్లగుద్ది నిలదీసింది దుర్గాదేవి. గట్టిగా కేకవేసింది కూడా. పైకప్పు ఊడిందేమోనని భయమేసి యస్సై జగదీశ్ చూపులు పైకి మళ్ళినై. లాఠీతో వీపు గోక్కుంటూ 'చెయ్యను గాక చెయ్యను' అన్నాడు. లేచి నుంచున్నాడు.

కుర్చీలో కాపురముంటున్న నల్లులు దుర్గాదేవి భారీ శరీరాన్ని తొలిచేస్తున్నై.

'అబ్బో ! నల్లులు పోలీసుల్తో పోటీ పడ్తున్నై నాయనో !' జబ్బలు గోక్కుని సర్దుక్కూచుంది. ఆవేశం పొంగుకొచ్చింది.

'దొంగతనం జరిగిందని మొత్తుకున్నా కంప్లైంటు రాసుకోని మీరెందుకటా ?' గబుక్కున లేవబోయి దబుక్కున వెనక్కు పడిపోయింది - కుర్చీతోసహా.

పుసుక్కున నవ్వాడు జగదీశ్. ఆవిడ భుజాలు పట్టి లేపి గుండెలకు హత్తుకున్నాడు.

హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, నగరేశం వేణుగోపాల్ అప్పుడే చేరుకున్నారక్కడికి.

'అన్యాయం, అక్రమం, అమానుషం, పట్టపగలు నట్టనడి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఓ అబలపై అత్యాచారం....' అరిచాడు వేణుగోపాల్.

కొత్త యస్సై గారు కొంటె కోణంగే ! ఆయనకి రాత్రీ పగలూ తేడా గూడా లేనట్టుంది - అనుకున్న సెంట్రీ ఎందుకైనా మంచిదని 'ఏమైంది సార్ !' అంటూ పరుగెత్తుకొచ్చాడు.

'ఏమైందా... అటు చూడు, దారుణం జరిగిపోతుంది' పత్రికా విలేకరిలా పోజిచ్చాడు వేణుగోపాల్.

నోటికి అరచెయ్యి అడ్డం పెట్టుకుని నవ్వుతూ వెనక్కు తిరగాడు సెంట్రీ.

ఆహా ! నాలాగా మా కొత్త యస్సైగారిది కూడా కోడిమెదడే ! హెడ్డు మొహం కొండమీద పడిన కోడిగుడ్డులా విచ్చుకుంది. ముందుకొచ్చి

'మీ కంప్లైంటేమిటమ్మా ఝ' అడిగాడు మర్యాదగా.

'నా భర్త మెడలో నిఖార్సైన బంగారు గొలుసు...'

'ఆహా ! మగపురుషుని మెడలో మేలిమి బంగారమా ! వెరీగుడ్. వెరీ గుడ్...'

'గుడ్డూ లేదు తెడ్డూ లేదు...' రుసరుసలు బుసబుసలుగా మారుతున్నై.

'మరేమయింది ?'

'అయ్యో :' పళ్ళు బిగుసుకుంటున్నై. 'ఆ బంగారు గొలుసు నెవడో కొట్టేశాడు. కంప్లైంటు రాసుకొమ్మంటే మీ కంగారు యస్సై కుదరదంటున్నారు. ఇదేనా న్యాయం ? ఇదేనా ధర్మం ? ఇదేనా ప్రజాస్వామ్యం ... ఇదే... ?' ఆయాసమొస్తుంది. గొంతు జీరబోయింది.

హెడ్డుగారి హెడ్డు కొన్ని క్వింటాళ్ళ బరువెక్కింది.

'చాలమ్మా చాలు ! ఇంతకీ మీ భర్త పేరేమిటీ ? ఎక్కడున్నారూ ? ఏంజేస్తున్నారూ ?' కాయితం కలమందుకున్నాడు - నాలుగు ముక్కలు రాసుకుని పీడా వదిలించుకోవాలని.

దుర్గాదేవి చూపులు యస్సై జగదీశ్ మీద కేంద్రీకృతమైనై. కుర్చీలో కూర్చోబోయి నల్లుల సంగతి గుర్తుకొచ్చి మానుకుంది.

'పేరు జగదీశ్. పంజేస్తుంది ఇక్కడే ఈ స్టేషన్లోనే యస్సైగా' బూడిద గుమ్మడికాయంతటి జగదీశ్ తలకాయ గోలీకాయంతైంది.

'ఇదేం బాగోతంరా జగదీశ్వరా ?' అప్పుడందుకున్నాడు నగరేశం. యస్సై అతని బాల్యమిత్రుడు.

తలకాయ తీసి గిలక్కొయ్యకు తగిలించినట్టనిపించింది హెడ్ కానిస్టేబుల్ కనకయ్యకు.

యస్సైకి రోషమొచ్చింది కాని లాభం లేదు.

'వెధవ మెడగొలుసు పోతేపోయింది గాని మీ చెల్లాయి నిక్కడి నుండి వెళ్ళిపొమ్మన్రా నగరేశా !' లాఠీతో తల కొట్టుకున్నాడు.

వేణుగోపాల్ నోరు బీటు కానిస్టేబుల్ జేబులా తెరుచుకుంది.

◎ ◎ ◎ ◎ ◎

'అలివేలక్కా... ఓ అలివేలక్కా !' దర్శనం కోసం పడిగాపులు గాస్తున్న ప్రజల్ని పలుకరించని మంత్రిలా గబగబా ఇంట్లోకొచ్చేశాడు వేణుగోపాల్.

'ఎవర్రా నువ్వు ?' ఉరిమింది అలివేలు. జడేసుకుని బొట్టు పెట్టుకుంటున్న ఆవిడ ముక్కుపుటాలెగిరి పడినై.

నేనక్కా... నేనే... వరంగల్ వేణుగోపాల్‌ను, పదేళ్ళు దుబాయిలో ఉండి పదిరోజుల క్రితమే వచ్చానక్కా !'

అలివేలు కళ్ళు అరిటాకులైనై. కనుబొమలు పైకి లేచినై. మా వేలువిడిచిన బాబాయి వరంగల్‌లోనే ఉంటున్నాడు గదా. వీడు ఆ బాబాయి కొడుకే అయుంటాడు. దుబాయ్ నుండి నా కోసం ఏవేవో బహుమతులా సూట్‌కేసునిండా తెచ్చుంటాడు.

'ఒరే... నువ్వట్రా ! ఎప్పుడో చెడ్డీలు కట్టుకునేప్పుడు చూశాన్రా ! చాలా మారిపోయావురా!'

'హమ్మయ్యా ! నీ ఇంటికొచ్చేసరికి నా తలప్రాణం తోకకొచ్చిందక్కా !' కుర్చీలో కూలబడ్డాడు. ఇల్లంతా కలియజూస్తూ అలివేలు అందించిన కాఫీ లాగించాడు.

చినిగిన షర్టూ, బోడిగుండుతో వచ్చిన ఓ శాల్తీ గడపలో కనబడగానే అలివేలు క్కోపమొచ్చింది.

'ఆ బోడిగుండెవడ్రా ? నిన్ను తరుముకొచ్చిన రౌడీగాడా ?' దవడ కండరాలు బిగుసుకో పోతూంటే చీపురుకట్టందుకుంది.

'ఆగక్కా.... కాస్తాగవే !'

'ఎందుకాగాల్రా ? నువ్వో పరికిపందవు' కొంగు బొడ్లో దోపుకుంది.

'ఆయన నీ మొగుడే ! నా బావ నగరేశమే !'

'నా తోనే మజాక్ చెయ్యకురా ! మీ బావ అప్పుడే ఆఫీసుకెళ్ళారు' ముందుకురక బోయింది.

'నిజమే గాని సిటీ బస్టాండ్ నుండి నేనే లాక్కొచ్చానే' బోడిగుండును మరోసారి కింది నుంచి చూస్తూ ' నీ మొహం ! ఎవడో బడాచోర్ బోడిగుండుగాణ్ణి పట్టుకుని బావంటావేంట్రా ?' రెచ్చిపోయింది.

'అది కాదే... మాటిమాటికి జుట్టు పీక్కుని, షర్టు చించుకుని బావిలాగైపోయాడే...'

బోడిగుండు తల రపీన పైకి లేచింది. జుట్టు పీక్కునే అవకాశం లేదు కాబట్టి గుండు మీద పుణుక్కుని చేతుల్లో మొహం దాచుకున్నాడు నగరేశం. తన ఎడమచేత్తో అతని చేతులు తొలగించి ఎగాదిగా చూసింది అలివేలు. గుండె ఝల్లుమంది.

'అయ్యో నా పతి ముండిపోనూ ! మీరటండీ... ఈ అవతారమేమిటండీ...' గుండెలు బాదుకుంది. చీపురు విసిరేసి లెంపలేసుకుంటూంది.

అప్పుడే గడప దాటి వస్తున్న యస్సై జగదీశ్ మీద పడిందా చీపురు. క్యాప్ జారి కిందపడింది.

'ఇదేంది సార్ ?' హెడ్ కానిస్టేబుల్ అదిరిపోయి వేణుగోపాల్‌ను చుట్టేశాడు.

ఆహా ! నా తమ్ముడంటే పోలీసుల కెంత ప్రేమో చూశారా ! అన్నట్టు భర్తవైపు చూసింది అలివేలు - గర్వంగా.

'దొరికింది. ఇదే నా బంగారు గొలుసు. దొరికింది' అంటూ వేణుగోపాల్ ప్యాంటు జేబులోంచి బంగారు గొలుసు తీసి కళ్ళకద్దుకున్నాడు జగదీశ్.

'నీ మెడ గొలుసు ఈ బద్మాష్ జేబులో కెట్లా వచ్చిందిరా జగదీశ్వరా ?' ఏమీ అర్థంకాక చినిగిన షర్టును మరింత చించుకున్నాడు నగరేశం.

జగదీశ్ పెదాల మీద చిరునవ్వు చిందేసింది.

'పొద్దున ఈ వేణుగోపాలుడూ, నేనూ ఒకే బస్సులో ఫక్కపక్క సీట్లో కూచుండి వచ్చాంరా... పది కిలోమీటర్లు దాటగానే నాకు నిద్ర ముంచుకొచ్చింది. నేనప్పుడు సివిల్ డ్రెస్సులో ఉన్నా కదా ! వీడు హస్తలాఘవం చూపించి నా మెడలోంచి బంగారు గొలుసు కొట్టేశాడురా !' గొలుసును మరోసారి కళ్ళకద్దుకుని మెడలో వేసుకున్నాడు.

'ఏంతైనా మా యస్సై గారదృష్టవంతులు' కనకయ్య అభినందించాడు.

'నాకప్పుడే అనుమానమొచ్చిందిరా నగరీ ! మిమ్మల్నిటు పంపించేసి అటు మీ చెల్లాయి దుర్గాదేవి చెవిలో వేశానీ అనుమానం. ఆవిడేమో వెంటనే ప్రొసీడ్ కమ్మంది. అంతే... ఆఘమేఘాల మీద పరుగెత్తుకొచ్చామనుకో. ఒంటిపేట గొలుసు పట్టేశాం. వీని సూటుకేసు సోదా చెయ్యాలి. అందులో ఇంకెన్ని దొంగ సామానులున్నాయో !' అంటూ వేణుగోపాల్ కోసం అటూ ఇటూ వెతికాడు. ఆ శాల్తీ కనపడలేదు.

'ఏడి... వాడేడీ ?' తేలు కుట్టినట్లు అరిచాడు.

'అరె... ఇప్పటిదాకా ఇక్కడే ఉండెను గదా !' నగరేశం చూపులు నాల్గువైపులా వెతికినై.

'అమ్మో... అమ్మో... నా పర్సు పోయింది సార్! ఈనెల జీతమందులోనే ఉండిపోయింది' జేబులు పుణుక్కుని పిచ్చివాడిలా గంతేశాడు కనకయ్య.

'ఆహా ! మా తమ్ముడు మా గొప్పకళాకారుడు' అలివేలు మురిసిపోయింది.

'వానికి ఘనసన్మానం చెయ్యాలిహ !' కసిగా గుండు నిమురుకున్నాడు నగరేశం.

'దొరికితే తప్పకుండా చేస్తాంరా !' ఎస్సై జగదీశ్ పళ్ళు పటపటలాడినై.

'అయ్యో... ఆ గాడిదికొడుక్కి పోలీసోడి పర్సే దొరికిందా ? నా కొంప ముంచేశాడు సారూ! పర్సూ, పరువు రెండూ పోయినై సారూ !' కనకయ్య జుట్టు పీక్కోబోయాడు.

'వద్దు... జుట్టు పీక్కోవద్దూ...' అంటూ గబగబా పాంటు జేబులు వెతుకున్నాడు నగరేశం. 'హమ్మా... నా పర్సు గూడా కొట్టేశాడు రా జగదీశా!' తలకొట్టుకుంటూ బోరుమన్నాడు నగరేశం.

**ఆంధ్రభూమి ఆదివారం 16, ఆగష్టు 1998**